క్లుప్తంగా

గ్రామీణులకు వైద్య సేవలు



వృద్ధునికి చికిత్స అందిస్తున్న డాక్టర్ వాణి

ఒంగోలు రూరల్: సర్వేరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను డాక్టర్ ఎస్.వాణి అందించారు. దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి 104 సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యదర్శి రాంమోహన్‌రావు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

3న ఆలయ దుకాణాల వేలం

మద్దిపాడు: మల్లవరం వెంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద షాపులకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి, ఈఓ దామా నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, టీ, టిఫిన్ కూల్‌డ్రింక్‌లు, తినుబండారాలు అమ్ముకునే హక్కు, పెండ్లిమండపం ఏర్పాటు, జనరేటర్‌పై లైటింగ్, ఐస్‌క్రీమ్ అమ్ముకును హక్కు, సోడాలు అమ్ముకునే హక్కు, బొమ్మల అంగడి ఇలా 8 రకాల షాపులకు మార్చి 3న వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఐదు వేల రూపాయల చొప్పున ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు.

వీధులు పరిశుభ్రంగా ఉండాలి



ఇళ్ల ముందు ఉన్న తొట్లలో నీరు తొలగిస్తున్న ఆశ వర్కర్లు

ఆలూరు (కొత్తపట్నం): పల్లెలో వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవల్సిన బాధ్యత ప్రజలపై ఉందని డివిజన్ పంచాయతీ అధికారి ఆర్. పద్మ అన్నారు. ఆలూరులో మంగళవారం నీరు నిల్వ ఉన్న తొట్లు, పాత్రలు, డ్రమ్ములు కనీసం వారంలో ఒక రోజు శుభ్రంగా కడుక్కుని ఆరబెట్టుకోవాలని సూచించారు. ఈవోఆర్డీ ఏ.బాల చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'మద్దాళి'కి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అవార్డును అందుకుంటున్న మద్దాళి మాధవరావు

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు మద్దాళి మాధవరావు మంగళవారం శింగరాయకొండలో గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. హోప్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డు వారు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాధవరావుకు డాక్టరేట్ అవార్డును అందించారు. గత 25 సంవత్సరాలుగా మాధవరావు చీమకుర్తిలో అభయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

రైతు ఖాతాలకు రూ. 91.72 లక్షల జమ

కొత్తపట్నం: మండలంలో మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా సీఎం కిసాన్ పథకం ద్వారా మండలంలో ఉన్న అర్హులైన రైతులకు 4,586 మందికిగా రూ.91.72 లక్షలు నగదును వారి ఖాతాలో జమ అయ్యాయని వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రైతుల సెల్‌కు మెసేజ్ రావడంతో చూసుకుని సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు నిండగా.. ఆనందం పొంగగా!

- వేగవంతంగా నీటి ఎద్దడి నివారణ చర్యలు



నిండుగా ఉన్న చెరువు

ఒంగోలు రూరల్: రానున్న వేసవిలో నీటి ఎద్దడికి అవకాశం లేకుండా తాగునీటి చెరువులను అధికారులు నింపుతున్నారు. ఒంగోలు మండలంలోని గ్రామాలన్నింటిలో యుద్ధ ప్రాతిపదికన ఈ చర్యలు ఊపందుకున్నాయి. గత ప్రభుత్వంలో వర్షా భావంతో చెరువుల్లో నీరు లేక మల్లవరం డ్యాంలో రిజర్వాయర్ పూర్తిగా అడుగంటిపోయింది. ఇలాంటి దుస్థితి పునరావృతం కాకూడనే ఉద్దేశంతో ప్రస్తుతం ముందస్తు చర్యలు చేపట్టారు. మల్లవరం నుంచి త్రోవగుంటకు, త్రోవగుంట నుంచి ఒంగోలు మండల రూరల్ గ్రామాలకు పైపు లైన్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. అయితే మరమ్మతులకు గురైనప్పుడు అనధికారికంగా పైపు లైన్ ఉన్న ప్రాంతంలోనే జేసీబీతో తవ్వకాలు చేపట్టిన సమయంలో తీర ప్రాంత గ్రామల వరకు నీటి యద్దడి తీవ్రంగా ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో వేసవిలో ఏర్పడే నీటి ఎద్దడి తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ గ్రామ సచివాలయాలు.. వాటి పరిధిలో ఉన్న చెరువులను నింపే కార్యక్రమాన్ని కొన్న గ్రామాల్లో పూర్తి చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను పరిశుభ్రం చేసి ఫ్లోరినేషన్, బ్లీచింగ్ చల్లించారు. ఫిల్టర్ బెడ్‌లలో నిల్వ ఉన్న ఇసుకను పూర్తిగా తొలగించి ఆర్‌డబ్ల్యూఎస్ వారు ఎంపిక చేసిన ఇసుకను ఫిల్టర్ బెడ్‌లలో నింపడం కూడా కొన్ని గ్రామాల్లో పూర్తయింది. జలజీవన్ మిషన్ ద్వారా మండలంలో 22 పనులకు గాను రూ.747.19 లక్షలతో పనులు నిర్వహిస్తున్నారు. నూతనంగా కుళాయిల కనెక్షన్‌లు 2138 ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే 689 కనెక్షన్‌లు అందజేశారు. ఇంకా 1449 గృహ కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. రానున్న వేసవిలో తాగునీటి సమస్య గ్రామాల్లో ఏర్పడకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ తెలిపారు. జలజీవన్ స్రవంతి పనులు రానున్న వేసవి లోగా నాణ్యతాపరమైన లోపాలు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఏఈ బాబు తెలిపారు.

ఉత్సాహంగా సైన్స్ డే



చీమకుర్తి: జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బహుమతులందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



గద్దలగుంటలోని ఓరియంటల్ హై స్కూల్‌లో..



శ్రీచైతన్యలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నాగులుప్పలపాడు: చిన్నారుల్లోని సృజనకు జాతీయ సైన్స్‌డే వేదికగా నిలిచింది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో సైన్స్ డే నిర్వహించారు. వాస్తవికంగా ఆలోచించడానికి విద్యార్థులకు సైన్స్ చాలా ఉపయుక్తంగా ఉంటుందని నాగులుప్పలపాడు ఎస్సై హరిబాబు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం నాగులుప్పలపాడు లోని ఆక్రిడ్జ్ పాఠశాలలో పలు సైన్స్ ప్రదర్శనలు ప్రదర్శించారు. అమ్మనబ్రోలు, నిడమానూరు గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చీమకుర్తి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్‌డే వేడుకలను నిర్వహించారు. చీమకుర్తి, బండ్లమూడి, గోనుగుంట, ఆర్.ఎల్.పురం, దేవరపాలెం జిల్లాపరిషత్ హైస్కూళ్ళలో సైన్స్ మోడల్స్‌ను ప్రదర్శించి శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించే ఉపన్యాసాలను అందించారు. చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులను గ్రూపుకు 9 మంది బాలికల చొప్పున 45 మంది బాలికలను గ్రూపులుగా చేసి క్విజ్ పోటీలను నిర్వహించారు. క్విజ్ కార్యక్రమాన్ని ఆసక్తిగా రూపొందించారు. విజేతలుగా నిలిచిన మొదటి మూడు గ్రూపులతో పాటు క్విజ్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థినికి శివం ఫౌండేషన్ అధ్యక్షులు గొల్లపూడి శ్రీహరి రూ.12 వేల ఆర్థిక సహకారంతో బహుమతులను అందించారు.



నాగులుప్పలపాడులో ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఎస్సై

భాష్యం విద్యాసంస్థల్లో...

ఒంగోలు టౌన్: రాంనగర్‌లోని భాష్యం విద్యా సంస్థల్లో సైన్స్ ఎక్స్‌పో-2023 ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలని ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి టి.కిషోర్ బాబు చెప్పారు. ప్రిన్సిపాల్ వెంకట రమణ, హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు మూఢ నమ్మకాలను విడిచిపెట్టి నూతన ప్రయోగాలతో ముందడుగు వేయాలని శ్రీ ప్రసన్న చెన్న కేశవస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథం అన్నారు. మంగళవారం గద్దలగుంటలోని ఓరియంటల్ హై స్కూల్ లో జాతీయ సైన్స్‌డే ను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయని ఎస్.పద్మావతి, డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, ఓగిరాల రాధాకృష్ణమూర్తి, కాటా నాగేశ్వరరావు, ఆరిగ శ్రీనివాసరావు, తోట చింటు హాజరయ్యారు.

క్విస్ కాలేజ్ ఆఫ్ ఫార్మశీలో..

1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్టును కనుగొన్న తేదీన జాతీయ సైన్స్‌డే ని జరుపుకుంటున్నట్లు ప్రెసిడెంట నిడమసూరి నాగేశ్వరరావు తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేశారు. డా.సూర్య కళ్యాణ్ చక్రవర్తి, దక్షిణమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డి.కళ్యాణి సూచించారు. డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన సైన్స్ డేలో ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరెడ్డి, కెజియా, కుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్రీమ్స్ ఒలింపియాడ్ స్కూల్‌లో..

ప్రాజెక్టులు పలువురిని ఆకర్షించాయి. రక్తదాన శిబిరం విజయవంతమైంది. రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు, స్కూలు కరస్పాండెంట్ లక్ష్మీదేవి, ఏపీటీసీఏ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రవీంద్ర భారతీ స్కూల్‌లో..

పాఠశాల నుంచే విద్యార్థులు కొత్త ఆలోచనలు చేయాలని కరస్పాండెంట్ తమ్మని సాత్విక్ రాజ్ చెప్పారు. ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్ తదితరులు హాజరయ్యారు.

శ్రీ చైతన్య స్కూల్‌లో..

ఒంగోలు అర్బన్: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సైన్స్‌డే వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయని శ్రీచైతన్య ప్రిన్సిపాల్ భూమా హర్షవర్ధన్ అన్నారు. భాగ్యనగర్‌లోని చైతన్య స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్ఐ అనిల్, ప్రిన్సిపాల్, డీన్ శివ, ఇన్‌చార్జ్, విద్యార్థులను అభినందించారు.



భాష్యంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కిషోర్



క్విస్ కాలేజీలో పరిశీలిస్తున్న నిడమానురి నాగేశ్వరరావు



డ్రీమ్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

అద్దంకి రూరల్: గుర్తు తెలియని వ్యక్తి ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారు చైను లాక్కుని పరారయ్యాడు. ఈఘటన మంగళవారం రాత్రి అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఓ ఇంటిలో వృద్ధ దంపతులు కిరాణ దుకాణం పెట్టుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలు ఒక్కతే ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైకు మీద వచ్చి కూల్ డ్రింక్ కావాలని అడిగి కూల్ డ్రింక్ తీసుకుని డబ్బులు ఇచ్చాడు. మిగిలిన చిల్లర ఇచ్చేందుకు వృద్ధురాలు గల్లా డబ్బా వద్దకు వంగింది. ఈ సమయంలో వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కుని బైకు మీద ఉడాయించాడు. ఈఘటన నుంచి తేరుకుని వద్దురాలు దొంగ దొంగ అరవటంతో చుట్టు పక్కల వారు వచ్చి దగ్గర ఉన్న అన్ని వీధులు వెతికినా కనిపించలేదు. ఈఘటనపై ఫిర్యాదు చేసేందుకు స్థానికులు వృద్ధురాలిని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. గతేడాది కూడా ఇదే ఇంటిని లక్ష్యంగా చేసుకుని అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి వృద్ధులపై దాడిచేసి బంగారం, నగదును దోచుకెళ్లారు.

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మేదరమెట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఐదు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం మార్చి 24లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ తరువాత బయటకు రావచ్చని, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక పథకాలు కూడా వర్తిస్తాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

చీరాల టౌన్: మండలంలోని ఈపూరుపాలెంలో కొలువై ఉన్న అంకమ్మతల్లి వార్షికోత్సవం మంగళవారంతో వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారి గ్రామ పర్యటన, జల బిందెలు, పసుపు కుంకుమ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడకల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపించారు.

అక్రమ మద్యం స్వాధీనం

చీరాల: పలు స్టేషన్ల పరిధిలో పోలీసుల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. చీరాల రూరల్, చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం గోవా నుంచి తెచ్చిన మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట పంచాయతీ, ప్రసాద్‌నగర్, వేటపాలెం మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమంగా మద్యం సీసాలను కలిగి ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురి వద్ద నుంచి 58 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ తెలిపారు. అలానే చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం బుర్లవారిపాలెం అడ్డరోడ్డు వద్ద 40 మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

పేస్ అధ్యాపకునికి డాక్టరేట్



చక్రవర్తిని అభినందిస్తున్న కరస్పాండెంట్

ఒంగోలు టౌన్: పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల విభాగం అధ్యాపకుడినగా పనిచేస్తున్న కాట్రగడ్డ సుధీర్ చక్రవర్తి చెన్నైలోని సవితా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టర్.ఎస్.మధు పర్యవేక్షణలో ఆయన సీసస్ విటిజినియా ప్లాంట్‌పై ఆయన చేసిన పరిశోదనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.కె మూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, ఏఓ ఎం.రమణబాబు, డీన్ వీరాంజనేయులు, మెకానికల్ విభాగాధిపతి జి.కొండయ్య తదితరులు అభినందించారు.

ఇళ్లకు శాశ్వత భూ హక్కు పత్రాలు



గ్రామ కంఠాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న పద్మ, బాలచెన్నయ్య

కొత్తపట్నం: ఎటువంటి హక్కులేని గ్రామ కంఠాల ఇళ్లకు భూశాశ్వత హక్కు పత్రాలు అందిస్తామని డివిజన్ పంచాయతీ అధికారి ఆర్. పద్మ అన్నారు. స్వమిత్వ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాదర్తి రెవెన్యూ పరిధిలో ఉన్న రంగాయపాలెం, మోటుమాల గ్రామ పంచాయతీలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ కంఠాల్లో ఎటువంటి పత్రాలు లేకుండా ఇళ్లు నిర్మించుకున్న యజమానులకు శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ పత్రాలకు రిజిస్ట్రేషన్‌తో సమానంగా హక్కులు వస్తాయన్నారు. బ్యాంక్‌లో లోను తీసుకోవాలన్నా, ఎక్కడైన తనఖా పెట్టుకోవాలన్నా ఉపయోగించుకోవచ్చన్నారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లరెడ్డి, హస్నానా బేగం పాల్గొన్నారు.

నాంచరమ్మ తల్లి స్థలం అన్యాక్రాంతం



పోలీస్ స్టేషన్‌లో వినతపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కొత్తపట్నం: గ్రామ దేవత శ్రీ నాంచారమ్మ తల్లి స్థలాన్ని కొంత మంది ఆక్రమణ చేసుకున్నారని గ్రామ కాపు గొరవరపు కోటయ్య, గ్రామస్తులు ఎస్సై, తహసీల్దార్‌లకు మంగళవారం వినత పత్రం అందజేశారు. కోటయ్య మాట్లాడుతూ సర్వే నెంబర్ 1429బీలో 72 గదులు నాంచరమ్మ తల్లికి హక్కు పత్రం ఉంటే కొంత మంది ఆక్రమణదారుల స్వాధీనంలో ఉందని, దానిని రెవెన్యూ అధికారులు కొలతలు కొలిచి ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేయాలని కోరారు. కొలతలు కొలుస్తుంటే గ్రామస్తులపై తప్పుడు కేసులు పెడుతున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంతూరి వెంకటేశ్వర్లు, కోడూరి బ్రహ్మారెడ్డి, తంబి కాంతారావు, గొవరపు శివాజీ, కోడూరి శ్రీను, పురిణి పోలయ్య తంబి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో ఉత్తమ వైద్యం



మాట్లాడుతున్న నల్లూరి నితిన్

ఒంగోలు అర్బన్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి సేవలందించేందుక శ్రీకారం చుట్టామని నల్లూరి నర్సింగ్ హోమ్ ఎండీ నల్లూరి నితిన్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఓపితో పాటు వైద్య పరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశంలో ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొందిన తొలి ఆసుపత్రి నల్లూరి నర్సింగ్ హోం అని, ఉమ్మడి రాష్ట్రంలో నర్సింగ్ ఎక్సలెన్స్ అవార్డు పొందిన తొలి ఆసుపత్రి అని తెలిపారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాతులూరి నరసింహమూర్తి, ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ నల్లూరి అరుణ కుమారి తదిరుతరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



ఉప్పుగుండూరులో విలియమ్స్ హోవే, స్వామి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టైలర్లు

నాగులుప్పలపాడు: కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే జయంతి సందర్భంగా మంగళవారం టైలర్స్ డే ఉప్పుగుండూరు గ్రామంలో నిర్వహించారు. విలియమ్స్ హోవే, టైలర్స్ డే సృష్టికర్త స్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. దర్జీ పేరాల చెన్నకేశవులు కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా రెండో సారి ఎన్నిక కావడంతో సత్కరించారు. సామాజిక కార్యకర్త శామ్యూల్, శ్రీను, మస్తాన్, సలాం, వెంకటేశ్వర్లు, అమరాబాబు, రామస్వామి, ఎస్.కె. మీరావలి, సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణతో రీసర్వే డీటీ వెంకటేశ్వర్లు

మద్దిపాడు: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు స్లిప్పులు వెంటనే పంపిణీ చేయలని మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ఓటరు వద్ద సంతకం చేయించుకుని తిరుగు రసీదు తీసుకోవాలని దానిని బీఎల్ఓ సంతకంతో తహసీల్దార్ కార్యాలయానికి 3వ తేదీ లోపు సమర్పించాలని ఆదేశించారు. రీసర్వే డీటీ వెంకటేశ్వర్లు, ఎలక్షన్ ఆపరేటర్ మరియదాసు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధం



ఇంటిలో నుంచి పైకి ఎగిసి పడుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

చీమకుర్తి: సంతనూతలపాడులో పూజారిగా పనిచేస్తున్న దివి వెంకట రమణాచార్యుల ఇంటిలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఫ్రిజ్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చి లోపల వ్యాపించాయి. పెంకుటిల్లు కావడంతో ఇంటిలోపల దూలాలకు మంటలు అంటుకొని ఇంటి పైకి ఎగిసి పడ్డాయి. దీంతో చుట్టు పక్కల వారు గమనించి అగ్నిమాపక శాఖాధికారులకు, పవర్ ఆఫీస్ వారికి సమాచారం ఇచ్చారు. పవర్ ఆఫీస్ వారు కరెంటు సరఫరాను నిలిపివేశారు. అంతలో ఒంగోలు నుంచి అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో వచ్చి ఇంటిపై నుంచి వస్తున్న మంటలతో పాటు ఇంటి లోపల మంటలను అదుపు చేసి మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా నియంత్రించారు. పూజారి వెంకట రమణాచార్యులు అద్దె ఇంటిలో ఉంటున్నారు. ఒక్కసారిగా ఫ్రిజ్‌లో నుంచి మంటలు రావడంతో ఇంటిలో బీరువా, దానిలోని వస్తువులు, వంట సామగ్రి దగ్ధం అయింది. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని వెంకట రమణాచార్యులు ఆవేదన వ్యక్తం చేశారు.